## బిజెపి గెలిస్తే ప్రమాదంలో ప్రజాస్వామ్యం




-ఓటమి భయంతోనే ఈడి, సిబిఐ దాడులు
-సిపిఎం సమావేశంలో బివి రాఘవులు

2 లో



# ప్రజాపక్షం
PRAJAPAKSHAM

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 14 | ఏప్రిల్ | 2024

పేజీలు 6


# పెద్దిపల్లిపై ఎందుకీ ఉదాసీనత..!

**- షార్ట్ ఫిలింతో సమాధానం చెబుతున్న అధికారులు**

**- ఇసుక బినామీకి రెవెన్యూ అధికారుల అండ**




**ప్రజాపక్షం/ చర్ల :** పెద్దిపల్లి ఇసుక ర్యాంపుపై అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతుండగా అటు గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. బినామీ కాంట్రాక్టర్‌తో చేతులు కలిపిన వివిధ శాఖల అధికారులు చేష్టలూడిగి చూస్తున్నారు. ఇసుక క్వారీ ప్రారంభమైన నాటి నుంచి నిబంధనలు పాటించక పోవడంతో ఇప్పుడు అధికారులు సైతం పీకల్లోతు కష్టాల్లో కురుకుపోయారు. అందుకే షార్ట్ ఫిలింలకు తెర లేపారు. పెద్దిపల్లి ఇసుక ర్యాంపులో గిరిజన సహకార సొసైటీ ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. గోదావరి నడిపాయ నుండి ట్రాక్టర్‌లు, కూలీలతో డంప్‌యార్డ్ వరకు తరలించాల్సి ఉంది. ఇలా చేస్తే గిరిజనులకు ఉపాధి దొరుకుతుంది. కానీ ఇక్కడ గిరిజనుల ఉపాధి ఊసే లేదు. గోదావరి నడిపాయ నుంచి ఇష్టానుసారంగా ఇసుకను యంత్రాలతో తోడుతూ డంప్ యార్డుకు తరలిస్తున్నారు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే షార్ట్ ఫిలిం ను ఉన్నతాధికారులకు చూపిస్తున్నారు.

**ఏమిటి షార్ట్ ఫిలిం....**

తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ కు చెందిన క్షేత్రస్థాయి అధికారులు ఇసుక గుత్తేదారులు వారి బినామీలతో కలిసి నీకింత నాకింత అంటూ పంచుకుంటున్నారు. వాస్తవానికి గోదావరి నుంచి

మిగతా 2లో..

### ప్రజలను ఆహ్లాదపరిచే విధంగా

# నిర్మించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మున్నేరు సిసి వాల్ ప్రొటెక్షన్ నిర్మాణ పనులు ప్రజలను ఆహ్లాదపరిచేవిధంగా రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు సిసి వాల్ ప్రొటెక్షన్

మిగతా 2లో..

**-నూతన చెక్‌డ్యాంలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**-మున్నేరు సిసి వాల్ నిర్మాణ పనులపై మంత్రి తుమ్మల సమీక్ష**

### భక్తులకు ఇబ్బందులు లేకుండా

# ఏర్పాట్లు చేయాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీరామ నవమి, పట్టాభిషేక మహోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు సజావుగా చేయాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా అన్నారు. శనివారం రామాలయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న రామనవమి ఏర్పాట్లును ఆమె దగ్గరుండి పరిశీలించారు.

**- కళ్యాణ మండపానికి చేరుకునేలా రవాణా సదుపాయం కల్పించాలి**

**- కలెక్టర్ ప్రియాంక ఆలా**

ఈ సందర్భంగా మిథిలా స్టేడియం, గోదావరి కరకట్ట,

మిగతా 2లో..

# పెద్దిపల్లిపై ఎందుకీ ఉదాసీనత..!

**(మొదటిపేజీ తరువాయి)**

డంపింగ్ యార్డు వరకు సొసైటీ సభ్యుల చే ఇసుకను తరలించాల్సి ఉంది. కానీ అలా చేయకుండా యంత్రాలతోనే తరలిస్తున్నారు. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అప్పుడు తెరపైకి వస్తుందేమో షార్ట్ ఫిలిం. టిఎస్ ఎండిసి అధికారులు ప్రతి ర్యాంపుకు సంబంధించి ఒక రోజు ట్రాక్టర్లు, కూలీలతో ర్యాంపులో ఫోటోలు తీస్తారు. అది కేవలం ఫోటో సెషన్ మాత్రమే. వారు కూలీలు కాదు, ఆ ట్రాక్టర్లు ఇసుక తోలేవి కాదు. ఫోటోలు తీసిన తర్వాత భద్రపరిచి ఎవరైనా గోదావరిలో యంత్రాలతో తోడుతున్నారని ఫిర్యాదు చేయగానే ఉన్నతాధికారులకు భద్రపరిచిన ఫోటోలను, వీడియోలను పంపించి పక్కదారి పట్టిస్తారు. ఉన్నతాధికారులకు కూడా గోదావరిలో ఏమి జరుగుతుందో తెలిసినా మౌనం వహించడం అలవాటుగా మారింది.

లెక్కా పత్రం లేని తరలింపు :

ఇసుక గోదావరి నుంచి ర్యాంపుకు తరలించేటప్పుడు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది ఖచ్చితంగా అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఆ పర్యవేక్షణ కొరవడింది. పెద్దిపల్లి ర్యాంపులో గోదావరి నుంచి ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించారనే దానిపై అధికారుల వద్ద సమాచారం లేదు. అందుకు సంబంధించి రికార్డుల నిర్వహణ లేదు. ఈ మొత్తం బాగోతం కొత్తగూడెం టిఎస్ ఎండిసి కార్యాలయం కేంద్రంగా జరుగుతుంది. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఇసుక ర్యాంపులకు సంబంధించి గోదావరి నుంచి ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుకను డంపింగ్ యార్డుకు తరలించారు. డంపింగ్ యార్డు నుంచి ఎంత ఇసుకను ఎగుమతి చేశారనే దానిపై లెక్కలు లేకపోవడం దీనిపై అన్ని శాఖల అధికారులు మౌనం వహించడం వెనక ఏ స్థాయిలో ఇసుకను పిండేసుకుని సొమ్ము చేసుకుంటున్నారో అవగతమవుతుంది. మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు గుత్తేదారులు ఎవరి వాటా వారికి పంచేస్తున్నారు. తమ వాటా రాకపోతే ఏదో ఒక నేపం చూపెట్టి రావాల్సిన దాని కంటే కాస్త అదనంగానే పుచ్చుకుంటున్నారు. పెద్దిపల్లి ఇసుక ర్యాంపు బినామీ కాంట్రాక్టర్‌కు స్థానిక రెవెన్యూ అధికారులు గ్రావెల్ తోలుకోవడానికి కూడా అనుమతులు ఇస్తున్నారు. సామాన్య ప్రజలు గ్రావెల్ వైపు చూస్తేనే మండిపడే చర్ల రెవెన్యూ అధికారులు బినామీ కాంట్రాక్టర్ విషయంలో మాత్రం పూర్తిగా సహకరిస్తున్నారు. ఎంఎన్‌డిసి, రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల తీరు ఎలా మారిందంటే నాదస్వరం ఊదుతుంటే పాము నాట్యం చేసినట్లు బినామీ కాంట్రాక్టర్ ఏమి చెబితే అధికారులు ఆ పని చేస్తున్నారు. ఇక్కడ నిబంధనలే ఉండవు.

పట్టించుకోని అధికారులు :



గోదావరి ఇసుక ర్యాంపులకు సంబంధించి క్షేత్ర స్థాయి అధికారుల సమాచారం పై మాత్రమే ఉన్నతాధికారుల ఆధారపడుతున్నారు. ఐటిడిఏ పివో కానీ, జిల్లా కలెక్టర్ కానీ ఆ ఇసుక ర్యాంపుల్లో ఏమి జరుగుతుందో కనీసం తెలుసుకునేందుకు ప్రయత్నించడం లేదు. దీనితో కోట్లాది రూపాయల ప్రకృతి సంపద అక్రమ అధికారులు, గుత్తేదారుల పరమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పెద్దిపల్లి సహా గోదావరి ఇసుక ర్యాంపులపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉంది. గోదావరి నుంచి ఎంత ఇసుకను తరలించారు, ఎంత ఎగుమతి చేశారు అనే దానిపై పూర్తి విచారణ జరిపి కాంట్రాక్టర్లు, బినామీ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని గిరిజనులకు న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పరిరక్షించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు కోరుతున్నారు.

---

## బిజెపి గెలిస్తే ప్రమాదంలో ప్రజాస్వామ్యం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిజెపి మరోమారు అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సిపిఎం పోలీట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు స్పష్టం చేశారు. దేశాన్ని ప్రమాదకర స్థాయికి బిజెపి పదేళ్ల పాలన తీసుకెళ్లిందన్నారు. మరోమారు అవకాశం కల్పిస్తే రాజ్యాంగ స్వభావం సైతం మారిపోతుందన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బివి రాఘవులు మాట్లాడుతూ బిజెపికి 370కు పైగా స్థానాలు వస్తాయని కార్పొరేట్ మీడియా ప్రచారం చేస్తుందని అంతర్జాతీయంగా కూడా బిజెపి దేశ గౌరవాన్ని పెంచిందని ప్రచారం చేయించుకుంటున్నారని కానీ ఇందులో వాస్తవం లేదన్నారు. ఓటమి భయంతో ఎన్నికల ముందు విపక్ష నాయకులను అరెస్టు చేయిస్తుందని రాఘవులు ఆరోపించారు. సిపిఎం పక్షాన లోక్‌సభ కు పోటీ చేస్తున్న కేరళ ఆర్థిక మంత్రి థామస్ హైజాక్ ఆర్‌బిఐ అనుమతితో విదేశాల నుంచి రూ. 6వేల కోట్ల మసాలా బాండ్లు సేకరించి విక్రయించారని ఈడి నోటీసులు ఇచ్చిందన్నారు. దీనిపై న్యాయ స్థానానికి వెళితే ఈడికి కోర్టు మొట్టికాయలు వేసిందని రాఘవులు తెలిపారు. కాంగ్రెస్, సిపిఎం సహా పలు పార్టీలపై జరిమానాల పేరుతో కోట్లాది రూపాయలు చెల్లించాలని నోటీసులు ఇస్తుందని ఇదంతా బిజెపి అభద్రతా భావంతోనే చేయిస్తుందని రాఘవులు తెలిపారు. ఓట్లు, సీట్లు వచ్చేటట్లు అయితే ఇతర పార్టీల నేతలను మార్చడం ఎందుకని రాఘవులు ప్రశ్నించారు. బిజెపి ఒక వాషింగ్ మిషన్‌లా మారిందని అవినీతి పరులను చేర్చుకుని నీతి పరులుగా చేస్తుందని ఆయన తెలిపారు. వైసిపి ఎంపి శ్రీనివాసరెడ్డిని టిడిపిలో చేర్చుకుని ఎన్డిఏ కూటమి నుంచి టికెట్ ఇవ్వడం అవినీతిని సమర్ధించడం కాదా అని ఆయన ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యం బతకాలని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, వై. విక్రం, చింతల చెరువు కోటేశ్వరరావు, మాచర్ల భారతి, సరళ, వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి



**(మొదటిపేజీ తరువాయి)**

క్రాపా రామలక్ష్మ ణ్మ ఏరియా, అన్నదాన సంత్రం తదితర ప్రాంతాలను ఆమె కలియతిరిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వీక్షించేందుకు పలు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున చలువ పందిళ్లు, మంచినీటి సదుపాయం, వసతి సౌకర్యం, కళ్యాణ మండపం వద్ద సెక్టార్ల ఏర్పాట్లు సోమవారం నాటికి పూర్తి చేయాలన్నారు. విధులను కేటాయించిన సిబ్బంది 16వ తేది ఉదయం 8 గం. వరకు వారివారి ప్రదేశాల్లో సిద్ధంగా ఉండన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, సెక్టార్ల వారీగా ప్రత్యేకాధికారులను నియమించాలన్నారు. ప్రతీ సెక్టార్‌కు శానిటేషన్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పోలీస్, సమాచార శాఖ , మెడికల్ క్యాంపులు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు బస చేసే ప్రాంతం నుండి కళ్యాణ మండపానికి చేరుకునేలా రవాణా సదుపాయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి నదిలో భక్తులు స్నానాలు చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు గజీతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా గోదావరి స్నానాలు చేసేందుకు భక్తుల కోసం 200 పంపులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామపంచాయితీ వారు ప్రత్యేకశ్రద్ధ కనబరిచి పట్టణంతో పాటు కళ్యాణ మండపం ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తలంబ్రాల కోసం 120,ప్రసాదాల కోసం 60 కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. విఐపి, వివిఐ, సామాన్య భక్తులు టిక్కెట్లు కొనుగోలు, వసంతికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచామని చెప్పారు. ఉభయదాతల టిక్కెట్ రూ.7500, వివిఐపి రూ.2500, విఐపి రూ.2000, సామాన్య భక్తులకు రూ.1000, రూ.300, రూ.150 టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అధికార యంత్రాంగం అంతా సమన్వయంతో పనిచేసి శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, ఆర్‌డిఓ దామోదర్ రావు, డిఆర్‌డిఓ విద్యాచందన, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ తిరుమలేష్, డిఎంహెచ్‌ఓ శిరీష, ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్, ఎస్‌డిసి సుమ, డిఏఓ బాబూరావు, తహశిల్దార్ శ్రీనివాస్, జిపి ఇఓ శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలను ఆహ్లాదపరిచే విధంగా నిర్మించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

నిర్మాణ పనులపై నిర్మాణ సంస్థ ప్రతినిధులతో భేటీ అయి సమీక్షించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టు రెండు నియోజక వర్గాల ప్రజలకు సంబంధించిందని ఇరు వైపులా ప్రజలను ఆహ్లాదపరిచేవిధంగా నిర్మించాలన్నారు. వీలైతే బోటింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్తులో వాల్ ఎత్తు పెంచుకోవడానికి వీలుగా నిర్మాణం చేపట్టాలని మంత్రి సూచించారు. వర్షాకాలంలో ఎంత వరద వచ్చినా మురుగు కాలువల ద్వారా పట్టణంలోకి బ్యాక్ వాటర్ రాకుండా పటిష్టమైన డ్రైనేజీ సిస్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు మొదలైన ప్రాంతం నుండి ప్రకాష్ నగర్ కింద ప్రాంతం వరకు ఎప్పుడు నీళ్లు నిల్వ ఉండేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే కొత్త చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ఖమ్మం నగరానికి తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా మున్నేరులో చెత్త పడేయకుండా వేయిలింగ్ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. వైకుంఠ ధామం దగ్గర స్నానాలు చేయడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట మెట్లు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ విషయంలో ఏదైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకు వస్తే మంత్రితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తుమ్మల నిర్మాణ సంస్థ ప్రతినిధులకు తెలిపారు.

## అలుపెరుగని పోరాటం పుస్తకావిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశంలో ఎమర్జెన్సీని మించిన నిర్బంధం అమలవుతుందని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు తెలిపారు. శనివారం స్థానిక మంచికంటి ఫంక్షన్ హాల్‌లో ప్రబీర్ పుర్కాయస్థ రచించిన అలుపెరుగని పోరాటం తెలుగు అనువాద పుస్తకాన్ని పలువురు వామపక్ష నేతలు, వివిధ వర్గాల ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బిజెపి విధానాలను పుస్తకంలో ప్రబీర్ తెలిపారన్నారు. ఉపా చట్టం కింద ఆయన జైలు జీవితం గడుపుతున్నారని విప్లవకారులు ఎంత కష్టానైనా సులభంగా ఎదుర్కొనే విషయాన్ని ఈ పుస్తకం ద్వారా పరిచయం చేశారని వివరించారు. గతంలో ఏ కారణం లేకుండానే జైలులో పెట్టవచ్చునని ఎమర్జెన్సీ నిరూపిస్తే అంతకు మించిన నిర్బంధం ఇప్పుడు కొనసాగుతుందన్నారు. ఆనందాచారి అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వామపక్ష నేతలు పోతినేని సుదర్శన్‌రావు, పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు, మందుల రాజేంద్రప్రసాద్, విద్యావేత్త రవిమారుత్, ప్రముఖ వైద్యులు ఎంఎఫ్ గోపీనాథ్, తెలుగు అనువాద రచయిత బోడపట్ల రవీందర్, వివిధ వర్గాల ప్రముఖులు నెల్లూరు నర్సింహారావు, విజయ్, మాచర్ల భారతి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో మద్యం సిండి'కేట్'గాళ్ల దందా..!

- ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు
- లైసెన్స్ వైన్ షాపుల్లో దొరకని బ్రాండ్ల మద్యం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు
- అన్ని బ్రాండ్ల మద్యం బాటిళ్లను అమ్మాలని డిమాండ్








**ప్రజాపక్షం/ మధిర :** మధిరలో మద్యం సిండి'కేట్'గాళ్ల దందా మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులకు మద్యాన్ని విక్రయిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. లైసెన్స్ వైన్‌షాపుల్లో ముఖ్యమైన బ్రాండ్లు మద్యం దొరకక మద్యం ప్రియులు ఇబ్బంది పడుతున్నారు. కావాల్సిన బ్రాండ్లు దొరకకపోవడంతో దొరికిన బ్రాండ్ మద్యాన్ని సేవించి అనారోగ్యానికి గురవుతున్నామని మద్యంబాబులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఎక్సైజ్ అధికారులు ముడుపుల మత్తులో చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మద్యంబాబులు విమర్శిస్తున్నారు. మధిర పట్టణంలోని నాలుగు లైసెన్స్ మద్యం షాపులు, మడుపల్లిలో రెండు షాపులు, రాయపట్నం, దెందుకూరు, సిరిపురం ఒక్కొక్క షాపులు ఒక సిండికేట్‌గా ఏర్పడి ఎంఆర్‌పి రేట్ల కంటే అధిక ధరలకు అమ్ముతూ మద్యంబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. లైసెన్స్ మద్యం షాపుల్లో నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాల్సి ఉన్నప్పటికీ ముఖ్యమైన బ్రాండ్లను రూ.50 నుండి రూ.100 వరకు అధిక ధరలకు బెల్ట్‌షాపులకు విక్రయిసున్నారని, వైన్స్ షాపుల్లో దొరకని మద్యం బ్రాండ్లు, బెల్టుషాపుల్లో అన్ని రకాల బ్రాండ్ల మద్యం దొరుకుతుందని మద్యంబాబులు వాపోతున్నారు. మధిర పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లల్లో కూడా మద్యంబాబుల నుండి అందిన కాడికి దోచుకుంటున్నారని పెద్ద ఎత్తున విమర్శలు విన్పిస్తున్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని, సిండికేట్‌గాళ్ల కన్నుసన్నలోనే బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం అధిక ధరలను నియంత్రించాలని, అన్ని బ్రాండ్ల మద్యం దొరికే విధంగా చర్యలు తీసుకోవాలని, బెల్టుషాపులను నియంత్రించాలని మందుబాబులు కోరుతున్నారు.

# కుల గణన లేకుండా రిజర్వేషన్లు అమలుకావు

బిఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు





**ప్రజాపక్షం/ముదిగొండ :** దేశంలో కులగణన చేయకుండా రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన ముదిగొండలో జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు...దేశంలో కులగణన చేయాలని చిత్తశుద్ధి బీజేపీ ప్రభుత్వంకు లేదని,తాను ఎంపీగా గెలిస్తే కులగణనతో పాటు బీసీ, మహిళా రిజర్వేషన్ల ప్రక్రియ కోసం పోరాడతామని ఆయన అన్నారు. దేశంలో బీసీ మంత్రిత్వశాఖ లేకుండా చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వంకు దక్కుతుంది అని ఆయన విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా మాట్లాడే నాయకులపై ఐటీ,ఈడీ,సీబీఐలతో దాడులు చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. కేసులు,వేధింపులకు మహానేత కేసీఆర్, వారిబాటలో నడుస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ... కులగణన జరగకుండా మహిళా,బీసీ రిజర్వేషన్స్ అమలు సాధ్యం కాదన్నారు. బలమైన నాయకులు నామా నాగేశ్వరరావును తిరిగి గెలిపించి పార్లమెంటులో ఉంటేనే మహిళా, బీసీ రిజర్వేషన్స్ అమలు కావడం ఖాయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన పొరపాటును సరిదిద్దుకునేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యే కోటేశ్వరరావు, జెడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు కొండవల కోటేశ్వరరావు, లక్ష్మారెడ్డి, పోట్ల ప్రసాద్, గడ్డం వెంకటేశ్వర్లుగౌడ్, మేగడ శ్రీనివాస్‌యాదవ్, తోట ధర్మారావు, బంక మల్లయ్య, అనంతరెడ్డి, మందరపు వెంకన్న తదితరులు ఉన్నారు.

# వంగవీడులో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాలు

- ఆందోళనలో ప్రజలు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండల పరిధిలోని వంగవీడు గ్రామంలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా గ్రామంలో అనేక మంది డెంగ్యూ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నారు. ఇటీవల కాలంలో సుమారు యువతీ(17) డెంగ్యూ వ్యాధితో చనిపోయినట్లు సమాచారం. గ్రామంలో డెంగ్యూ వ్యాధి వ్యాప్తి అధికంగా ఉన్నప్పటికీ వైద్యశాఖఅధికారులు మాత్రం తూతూ మంత్రంగా క్యాంపులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. కనీసం ఎఎన్ఎం కూడా వ్యాధికి కారణమైన విషయాలపై గ్రామంలో అవగాహన కల్పించటం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో దోమలు విఫరీతంగా ఉన్నాయమని, ముఖ్యంగా పారిశుద్ధ్యం లోపించడంతో పాటు, కలుషిత మంచినీటి వలన కూడా డెంగ్యూ వ్యాధి గ్రామంలో ప్రబలుతుందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వలననే ఈ పరిస్థితి దాపురించిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిండంతో పాటుగా మెరుగైన వైద్య సదుపాయాలను గ్రామ ప్రజలకు కల్పించాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటిసి ప్రియాంక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండల జెడ్పీటిసి మాలోత్ ప్రియాంక కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం మండల పరిధిలోని సుకినితండా గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో జెడ్పీటిసి మాలోత్ ప్రియాంక కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటిసి ప్రియాంకకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీటిసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడంతో పాటు అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఖమ్మం నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, ఎంపిపి భూక్యా గౌరి, కార్పొరేటర్లు మలీదు జగన్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, తేజావత్ వెంకన్న, తారాదేవి, లక్ష్మ ణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పూజలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని యుపిహెచ్ కాలనీలో గల శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో 20వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, అర్చకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లెబోయిన చంద్రం, మిక్కిలినేని నరేంద్ర, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, ఏలూరి శ్రీనివాసరావు, దండా జ్యోతిరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ కొమరయ్య, యల్లంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర స్వామి ఆలయంలో నామ పూజలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని యుపిహెచ్ కాలనీలో గల శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఖమ్మం పార్లమెంట్ బిఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపి నామ నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో 20వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు శనివారం ఎంపిలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ లు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ మంత్రి పిఏ చిరుమామిళ్ల రవికిరణ్, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ట్రాఫిక్ విదుల్లో ఉన్న పోలీసులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఖమ్మం ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు తెలిపారు. విఎన్ఆర్ డెయిరీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీని ట్రాఫిక్ ఏసిపి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ట్రాఫిక్ విదులు నిర్వహించే పోలీసులకు 100 రోజుల పాటు విఎన్ఆర్ డెయిరీ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సామాజిక ధృక్పథంతో పోలీసులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన విఎన్ఆర్ డెయిరీ నిర్వహకులు డి. లింగరాజు, కమలాకర్, నర్సింహారావు లను ఏసిపి అభినందించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ మోహన్‌బాబు, ఎస్ఐ రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మెకానిక్ కుటుంబానికి రూ. 80వేల ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టూ వీలర్ మెకానిక్‌గా పనిచేస్తూ మృతి చెందిన మృతుని కుటుంబానికి ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఖమ్మంలో టూ వీలర్ మెకానిక్‌గా పనిచేస్తున్న బత్తిని నిఖిల్ గత నెల 22న అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని తల్లిదండ్రులు బత్తిని రమేష్ సుకన్య లకు యూనియన్ తరుపున శనివారం రూ. 80,600 ఆర్థిక సహాయాన్ని యూనియన్ అధ్యక్షులు వంగాల కొండల రావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ యూనియన్ సభ్యుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ. 20 లక్షలకు పైగా మెకానిక్ కుటుంబాలకు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. యూనియన్ సభ్యత్వం కలిగిన ప్రతి మెకానిక్ కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. యూనియన్ తరుపున సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మురళి, రమేష్, శ్రీను, నాగేశ్వరరావు, బ్రహ్మం, రవి, అనిల్, సుబాని, శివ రామకృష్ణ, హరీష్, శేషు, చారి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచిత రక్తదానం

**ప్రజాపక్షం/కరకగూడెం:** ప్రస్తుతం రోజుల్లో చూసినట్లయితే ఎక్కడ చూసినా కూడా యాక్సిడెంట్ అయ్యి మరియు రక్తం అనేది తక్కువ అయిపోవడం, సమయానికి రక్తం అనేది అందక చాలా మంది చనిపోవడం జరుగుతుందని విజయ్ బ్లడ్ బ్యాంక్ వ్యవస్థాపకులు ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన వి. విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలా రక్తం అనేది దొరక్కపోవడం వల్ల చాలా మంది చనిపోతున్నారని, ఇలా రక్తం అందక్క ఇబ్బంది పడడం నా దేశంలో చూడవలసి వస్తుందనుకోలేదు, రక్తం అందక చాలా మంది చనిపోవడం చూసి చాలా భాద పడ్డానని తెలిపారు. ఇక ముందు ఎవరు ఇబ్బంది పడకూడదు అని, అందరికీ రక్తం అందేలా చేయాలని విజయ్ బ్లడ్ బ్యాంక్ ఉచిత రక్త దానం చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. ఎవరి దగ్గర ఒక్క రూపాయి కూడా ఆశించకుండా అత్యవసర సమయంలో రక్తం అందేలా చేశారని, ఎన్నో సంవత్సరాల నుండి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రెండు రాష్ట్రంలో సుమారు 300 బ్రాంచిలు పెట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకొనే ఎన్నో జిల్లాల్లో అత్యవసర సమయంలో రక్తం అనేది అందేలా చేసినట్లు విజయ్ బ్లడ్ బ్యాంక్ సంస్థ స్థాపకులు వి. విజయ్ కుమార్ తెలిపారు.

## ప్రమాదవశాత్తు వరి గడ్డి దగ్ధం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రమాదవశాత్తు వరి గడ్డి కి నిప్పు అంటుకుని బుగ్గి పాలైంది. బాధితుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగ్రాజుపల్లి గ్రామానికి చెందిన యర్రపు శ్రీనివాసరావు అనే రైతు కు చెందిన వరి గడ్డి 450 దిండ్లు ప్రమాదవశాత్తు కాలిపోయాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. వీదురు గాలుల వలన ప్రజలు మంటలను ఆర్పేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. సమాచారం మేరకు ఫైరింజన్ నేలకొండపల్లి నుంచి వచ్చి మంటలను అదుపు లోకి తీసుకొచ్చింది.గడ్డి పక్కనే గ్రామానికి చెందిన పెద్దిరాజు బుర్రయ్య అనే వ్యక్తి కి చెందిన పూరి గుడిసె దగ్గర్లో ఉంది. మంటలు బలంగా వ్యాపించి గుడిసె ను అంటుకుంటాయని స్థానికులు ఆందోళన చెందారు. ఫైరింజన్ నీటి తో గుడిసె మొత్తం కు నీటిని కొట్టించారు. లేని పక్షంలో ప్రమాదం జరిగేదని స్తానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సదరు రైతు కు దాదాపు రూ.50 వేల వరకు నష్టం వచ్చిందని పేర్కోన్నారు.

## వేణుగోపాల స్వామి పునఃప్రతిష్ఠలో పాల్గొన్న డాక్టర్ మట్టా



**ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్ :** పట్టణ పరిధిలోని జవహర్ నగర్ లో 30 సంవత్సరాల చరిత్ర గల శ్రీ రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాల స్వామి పునఃప్రతిష్ఠ మరియు ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమంలో శనివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## తేనేటి విందులో పాల్గొన్న మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని నాల్గవ డివిజన్ సీనియర్ ఎంఆర్‌పిఎస్ నాయకులు, మాదిగ ఉద్యోగుల సంఘం నాయకుడు గుండెపాక నర్సయ్య ఇంటి వద్ద ఏర్పాటు చేసిన తేనేటి విందులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. శనివారం నర్సయ్య ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని తేనేటి విందు స్వీకరించారు. ఈ సందర్భంగా నర్సయ్య కుటుంబ సభ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శాలువలతో ఘనంగా సన్మానించారు. కొద్దిసేపు స్థానికులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రముఖ విద్యావేత్త, కవి ముప్వా శ్రీనివాసరావు, మిక్కిలినేని నరేంద్ర, ఈదర నరేష్, మడికంటి కృష్ణ, అక్బర్, కె.సుధాకర్, ప్రవీణ్, సందీప్, హుస్సేన్, నరేందర్, మలీదు వెంకటేశ్వర్లు, కాపా ఆదినారాయణ, పల్లెబోయిన చంద్రం, మలీదు జగన్ తదితరులు పాల్గొన్నారు.



**నలంద స్కూల్‌ను సందర్శించిన మంత్రి తుమ్మల...**
ఖానాపురం యుపిహెచ్ కాలనీలోని నలంద స్కూల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు స్కూల్ కరస్పాండెంట్ కుదారపు సూరిబాబు ఉషామాధురి దంపతులు, కుటుంబ సభ్యులు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తన గెలుపుకు కృషి చేసిన సూరిబాబును అభినందించారు. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అల్పాహార విందులో మంత్రి పాల్గొని అల్పాహారాన్ని సేవించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త, కవి ముప్వా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు జగన్, మలీదు వెంకటేశ్వర్లు, పల్లెబోయిన చంద్రం, వివిధ పాఠశాలల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా..!

**-ఇసుక రవాణాకు అడ్డాగా ఉమ్మడి పూసుగూడెం పంచాయతీ**
**-రోజు ట్రాక్టర్లను పట్టుకుంటున్నా భయపడని ఇసుకమాఫీయా**
**-పోలీసులకే సవాల్‌గా మారుతున్న ఇసుక మాఫీయా**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టపడేలా లేదు...మండలంలో స్థానిక ఎస్ఐ రాజమౌళి రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక మాఫీయా ఆటలు కట్టిస్తున్నా ఏదో ఒక మూల అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా యద్ధేచ్ఛగా సాగిస్తున్నారు. పోలీసులంటే భయం లేదు అన్న రీతిలో పోలీసులకే సవాల్ విసురుతున్నారనే చెప్పక తప్పదు.మండలంలోని పూసుగూడెం, సీతారామపురం పంచాయితీల్లో ఎక్కువ ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. పాల్వంచ పట్టణం ఈ రెండు పంచాయితీలకు దగ్గర ఉండటంతో ఈ అక్రమ రవాణాకు బ్రేక్ పడటం లేదు. పాల్వంచ పట్టణంలో ఒక్క ట్రాక్టర్ ఇసుక రూ 3వేలకు మించి రేట్ పలకడంతో సంపాదనకు అలవాటుపడ్డ కొందరు ఇదే పనిని సందు దొరికినప్పుడల్లా చేస్తున్నట్లు తెలుస్తుంది. అక్రమ మార్గంలో సంపదనకు మరిగిన కొందరు రాజకీయ పలుకుబడిని ఆసరా చేసుకొని ఈ దందాకు పాల్పడుతున్నారు. పోలీసులు కేసు చేసిన ప్రతిసారీ రాజకీయ నాయకుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్ఐ రాజమౌళి**
మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ రాజమౌళి ఇసుక మాఫీయాను హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం పూసుగూడెం, సీతారామపురం పంచాయితీల నుంచి కొందరి ట్రాక్టర్లను ఇసుక అక్రమ రవాణా చేస్తుంటే పట్టుకున్నారు. వారందరినీ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇసుక రవాణా చేస్తు పట్టుబడితే క్షమించేది లేదని హెచ్చరించారు. రెండు సార్లకు మించి రవాణాలో ట్రాక్టర్ యజమానులు దొరికితే పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడు





**పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ**

**ప్రజాపక్షం/గుండాల :** ఏజెన్సిలోని మారుమూల గ్రామాల నిరుపేద విద్యార్దులకు ప్రాథమిక విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నప్పటికి కొందరు ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో విద్యార్దులకు ఇక్కడ విద్య అందని ద్రాక్షగా మారింది అనడానికి నిలువెత్తు సాక్ష్యం మండల పరిదిలోని నాగారం ప్రాథమిక పాఠశాలలో నెలకొంది. పాఠశాల విధులకు నెలలో వారం రోజులు మాత్రమే హాజరౌతున్నారని దీనితో తమ పిల్లల విద్యా బోదనపై గ్రామస్తులు మండల విద్యాశాఖాధికారి క్రిష్ణయ్యకు ఫిర్యాదు చేయడంతో శనివారం నాగారం లోని పాఠశాలను సందర్శించగా పాఠశాలకు తాళం వేసి ఉండాన్ని గమనించి , గ్రామస్తులలు, విద్యార్దులను కలసి ఉపాధ్యాయుని పనితీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు రాక పోవడంతోపాటు , పాఠశాల పున ప్రారంబంనుడే విద్యార్దులకు మద్యాహ్న బోజనం అందించకుండానే అందిస్తున్నట్లు నకిలీ బిల్లులను అందించి నగదును కాచేస్తున్నట్లు ఎంఇఒకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు ఎంఇఒ వివరించారు. తక్షణ మే ఈ ఉపాధ్యాయున్ని తొలగించి మరో ఉపాధ్యాయున్ని నియమించి తమ పిల్లలకు విద్యాబోదన అందించే విదంగా చూడాలని ఎంఇఒను కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందిచిన ఎంఇఒ గైర్హాజర్ అవుతున్న ఉపాధ్యాయునికి షోకాస్ నోటీస్ జారిచేయడం .రిగిందని , జిల్లా విద్యాదికారి దృష్టికి తీసుకెల్లి శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# సిఎం ఆదేశం మేరకే దాడులు

**-15వ తేదీ బంద్‌ను జయప్రదం చేయండి**
**-మావోయిస్టు బహిరంగ లేఖ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ములుగు జిల్లా నుగూరు వెంకటాపురం మండలం సరిహద్దుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే గ్రేహౌండ్స్ బలగాలు దాడి చేశాయని మావోయిస్టులు ఆరోపించారు. తెలంగాణకు కూలీకి వెళ్తున్న సాధారణ ప్రజలను అక్రమంగా అరెస్టు చేసి మావోయిస్టుల సమాచారం చెప్పాలని లేదంటే ఎన్‌కౌంటర్ చేస్తామని, జైళ్లకు పంపుతామని బెదిరంచి ఇన్ఫార్మర్లుగా మార్చుకున్నారని లేఖలో ఆరోపించారు. శనివారం నుగూరు వెంకటాపురం బీజాపూర్ జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్ పై ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. వేటగాళ్ల పేరుతో జంతువుల వేటకు పంపించి సమాచారం తెలుసుకుని పీపుల్ లేబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఏ) బలగాలపై దాడులు చేశారన్నారు. ఈ దాడిలో ముగ్గురు మృతి చెందారని వారు లేఖలో పేర్కొన్నారు. అన్నే సంతోష్, అప్కా మణిరాం, పూనెం లక్ష్మణ్ మృతిచెందిన వారిలో ఉన్నారని అన్నె సంతోష్ తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుషాపురం గ్రామానికి చెందిన వాడన్నారు. 24 ఏళ్ల విప్లవ జీవితంలో ఉన్నారని మావోయిస్టులు లేఖలో తెలిపారు. ఛత్తీస్ గఢ్ రాష్ట్రానికి చెందిన పూనెం లక్ష్మణ్, అప్కా మణిరాం సుదీర్ఘ కాలంగా పిఎల్‌జిఏ లో పని చేస్తున్నారని లేఖలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో కాగార్ ఆపరేషన్‌ను తీవ్రతరం చేశారని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తి కాక ముందే విప్లవ కారులపై దాడికి తెగబడుతుందని లేఖలో పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఏడవ గ్యారెంటీగా చెప్పుకున్న రేవంత్‌రెడ్డి ఎన్‌కౌంటర్లను ప్రేరేపించడం ఏమిటని మావోయిస్టులు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నాడని మావోయిస్టులు లేఖలో ఆరోపించారు. కాగార్ దాడిని ఖండిస్తూ ఈనెల 15న సిఆర్‌పి ఇచ్చిన బంద్ పిలుపును జయప్రదం చేయాలని మావోయిస్టులు లేఖలో కోరారు.


భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)
తెలంగాణ రాష్ట్ర కమిటీ
పత్రికా ప్రకటన
తేది: 13.04.2024

## వడ్ల కొనుగోళ్లలో చేతివాటం ప్రదర్శిస్తున్న దళారులు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో దళారుల వ్యవస్థతో ఆర కాలం కష్టపడి పండించిన రైతులు చాలా నష్టపోతున్నారని, రైతే రాజన్న ప్రభుత్వంలో దళారుల చేతివాటంతో రైతుకు గిట్టుబాటు ధర దొరకక అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని బిజెపి మండల అధ్యక్షులు సాయి శ్రీను ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పెట్టేవాడు ఉన్న తినేవాడు దాకా రాకుండా దళారులు అడ్డగోలుగా వారికి ఇష్టరాజ్యంగా గిట్టుబాటు ధర విషయంలో రైతులకి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మండల పరిధిలో ఉన్న అనేక మంది వడ్లు కొనుగోలు దారులు సిండికేట్గా మారి వారికి నచ్చిన ధరను వాళ్ళు ఏర్పాటు చేసుకుని, వారు చెప్పిందే వేదంగా విచ్చలవిడిగా కొనుగోలు సాగిస్తున్నారని ఆరోపించారు. ఆరుకాలం కష్టపడ్డ రైతులు ఈ దళారుల వల్ల చాలా వరకు నష్టపోతున్నారని, మధ్యలో ఉన్న దళారులు మాత్రం కోట్లకు సంపాదిచుకుంటున్నారన్నారు. ఈ కొనుగోలుదారులకు ఎటువంటి లైసెన్స్ లేకపోవడం కొసమెరుపు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇటువంటి దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గ్రామాలలో డాక్టర్ సాయి కళ్యాణ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటీరియల్ హై రిస్క్ గ్రామాల నిఘాలో భాగం శనివారం గ్రామాలలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో 75 మంది రోగులను పరీక్షించగా 5 మంది రోగులకు జ్వరం కారణంగా రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందని, మలేరియా పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చినవని, ఇవన్నీ వేసవి కాల ప్రారంభంలో సాధారణంగా వచ్చే జ్వరాలుగా భావించి తగు చికిత్స చేయడం జరిగిందన్నారు. జలుబు ఇతర కారణాలు, కాళ్ల నొప్పులు వంటి సాధారణ చిన్న చిన్న రుగ్మతలు గల 70 మంది రోగులకు తగు చికిత్స అందించడం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ సాయి కళ్యాణ్ మాట్లాడుతూ ప్రజలకు వేసవి కాలంలో పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు. వడదెబ్బ నివారణ చర్యల గురించి వివరించారు. ఎండలు వివరీతంగా ఉన్న నేపథ్యంలో పనులకు వెళ్లే ప్రజలు ఎండ బారిన పడకుండా నెత్తిమీద కనీసం వస్త్రాన్నైనా కప్పుకొని వెళ్లాలని, అలాగే వీలున్నంత ఎక్కువగా త్రాగునీటిని పెద్ద పెద్ద బాటిల్స్‌లో తీసుకువెళ్లాలని, నీటిని ఎక్కువగా తాగాలని ఆశా దగ్గర అందుబాటులో ఉండే ఓఆర్ఎస్ ప్యాకెట్లను తీసుకొని పని వద్దకు వెళ్లాలని, లీటర్ నీటిలో ఒక ప్యాకెట్‌ను పూర్తిగా కలిపి ఆ ద్రావణాన్ని 24గంటల్లో తాగటం పూర్తి చేయాలని సూచించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో పిహెచ్ఎస్ దయామణి, హెల్త్ సూపర్వైజర్ శ్రీ కృష్ణ, నాగమణి, హెల్త్ అసిస్టెంట్ హనుమంతరావు, స్థానిక ఏఎన్ఎం రమాదేవి, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి కారు పల్టీ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రంలోని మూలలమలుపు వద్ద కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. స్తానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఖమ్మం నుంచి కోదాడ వైపు వస్తున్న కారు నేలకొండపల్లి సమీపంలోకి రాగానే ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి....డివైండర్ ను డీకొట్టి అక్కడ నుంచి పొలాల వైపు దూసుకెళ్లింది. చివరకు పంట కాలువ లో కారు ఇరుక్కుని ఆగింది. పల్టీలు కొట్టిన కారు లో ఎంత మంది ఉన్నారు. ఎవరికి ఏమీ జరిగింది అనే వివరాలు తెలియాల్సి ఉంది. చికిత్స కోసం ఖమ్మం వెళ్లినట్లు సమాచారం.



## భార్యపై రోకలిబండతో దాడి

**ప్రజాపక్షం/ చింతకాని :** అనుమానంతో భార్యపై రోకలిబండతో దాడి చేసి ఆమెను హత మార్చేందుకు ప్రయత్నించిన సంఘటన శనివారం చింతకాని మండలం బస్వాపురం గ్రామంలో జరిగింది. చింతకాని పోలీసులు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రసపుత్ర ముత్తారావు భార్య లలిత ప్రవర్తనపై కొంతకాలంగా అనుమానం ఉంది. కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్ధలు చోటు చేసుకున్నాయి. శనివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో నిద్రిస్తున్న లలితపై రోకలిబండతో భర్త దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తలకు తీవ్ర గాయమై అపస్మారకస్థితిలోకి వెళ్లింది. ఆమెను స్థానికులు ఆటోలో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సంఘటనాస్థలాన్ని వైరా సిఐ సాగర్, ఎస్సై నాగుల్‌మీరా, సందర్శించి సంఘటన వివరాలు ఆరా తీశారు.

## ఇద్దరిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/ చింతకాని :** చింతకాని మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన వేల్పుల బాలాజీపై పాత కక్షలు దృష్టిలో ఉంచుకుని రాయల రాంబాబు, రాణిలు దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించారు. బాలాజీ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాపక్షం/ చింతకాని :** చింతకాని చిన్నమండవ మున్నేటి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను జగన్నాథపురం సమీపంలో పోలీసులు శనివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

## పోరాటాల స్ఫూర్తితో ముందుకు సాగుదాం



**ప్రజాపక్షం/ బోనకల్ :** పోరాటాల స్ఫూర్తితో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలని టిఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అన్నారు. టిఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా సంఘ పతాకాన్ని సీనియర్ నాయకులు సద్దా బాబు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు మరింత కృషి చేయాలన్నారు. సామాజిక స్పృహతో సమాజానికి సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బి.ప్రీతం, ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, కోశాధికారి కె.రమేష్, ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, ఉపాధ్యక్షురాలు కె.సౌభగ్యలక్ష్మి, కార్యదర్శులు చిన్న రంగారావు, సిహెచ్.కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా టిఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ జెడ్పిహెచ్ఎస్ పాఠశాల నందు శనివారం టిఎస్‌యూటీఎఫ్ దశాబ్ది అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ యూటీఎఫ్ కార్యకర్త రెడ్డెం కృష్ణారెడ్డి పతావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ ఎన్.దామోదర్‌ప్రసాద్ ముఖ్యఅతిధిగా హాజరై ఈ వేడుకలను ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రంజాన్ మాట్లాడుతూ టిఎస్ యూటిఎఫ్ ఏర్పడి పది సంవత్సరాల కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎంతో కీలక పాత్ర పోషించిందన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్, కె.రామకృష్ణారావు, కె.రాధ, ఎం.నర్సింహారావు,, ప్రగత్‌కుమార్, సమ్మయ్య, ఎస్‌కె.రఫీ, టి.సునీత, మురళీకృష్ణ, జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. వివరాల్లోకి వెళితే తిరుమలాయపాలెం మండల పర్యటనలో భాగంగా శనివారం హైదరాబాద్ నుండి బయలుదేరి మరిపెడ బంగ్లా నుండి ఖమ్మం వస్తుండగా తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం స్టేజి చెక్ పోస్ట్ వద్ద పోలీసు అధికారులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాన్వాయ్‌ని ఆపి శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చెయ్యగా అధికారులకు ఆయన పూర్తిగా సహకరించారు. అనంతరం వాహనాన్ని పంపించారు. చెక్‌పోస్ట్ వద్ద పలుశాఖల అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.

# లోక్‌సభకు వినూత్న ప్రచారం



- శుభ, అశుభ కార్యాలకు హాజరవుతున్న ఎంపి అభ్యర్థులు
- సమన్వయ సమావేశాలకే మొగ్గుచూపుతున్న ప్రధాన పార్టీలు
- సంఘాల మద్దతుకు తీవ్ర యత్నం
- భారీ ప్రచార ఖర్చులకు వెనుకడుగు

ప్రజాపక్షం/భద్రాచలం : లోక్‌సభ ఎన్నికల సమయం ఆసన్నమవుతుండటంతో ప్రధాన పార్టీలకు చెందిన పోటీదారులు (అభ్యర్థులు) వినూత్నరీతిలో ప్రచారాలు సాగిస్తున్నారు. అన్ని శుభ, అశుభ కార్యాలకు హాజరవుతూ అప్యాయంగా అందర్నీ పలుకరిస్తున్నారు. ఇదిలా ఉండగా సభలు,సమావేశాలకంటే సమన్వయ సమావేశాలే ఎక్కువ ఫలితాలు ఇస్తాయని అధిక ప్రాధాన్యతనిస్తూ మండలాల స్థాయిలో నిర్వహిస్తూ ప్రచార జోరును పెంచుతున్నారు. బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులు నేతలతో పాటు ఇతర వర్గాల వారిని కలుస్తూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో సభలు నిర్వహించినప్పుడు పెట్టిన ఖర్చును తెలుసుకుంటున్న ఎంపి అభ్యర్థులు ఆ ఖర్చు నుండి తప్పించుకునేందుకు ప్రధాన నేతలతో సమావేశాలకే పరిమితం అయ్యారు. నామినేషన్ వేసిన తర్వాత పూర్తిస్థాయి ప్రచారం నిర్వహించడంతో పాటు నియోజకవర్గాల పరిధిలో బహిరంగ సభలను పెట్టేందుకు యోచిస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో బిజెపి నుండి మాజీ ఎంపి ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపి, మాజీ కేంద్ర సహాయ మంత్రి పోరిక బలరాం నాయక్, బిఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపి మాలోత్ కవిత పోటీ చేస్తున్నారు.

**అసెంబ్లీ ఎన్నికలకే గుణపాఠంగా....**

గత అసెంబ్లీ ఎన్నికల ఖర్చు అభ్యర్థులకు తడిసి మోపెడయ్యింది. దీంతో ఎంపి అభ్యర్థులు ఆచి తూచి అడుగులేస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఏడు నియోజవర్గాల్లోని ఒక్కొక్క నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఖర్చు కోట్లలో పెట్టాల్సి వచ్చింది. అధినేతలు, అగ్రనేతలు వస్తే ఓట్లు పడతాయని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పోటాపోటీగా భారీ ఎత్తున బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు పెట్టాయి. ఈ మీటింగులకు భారీ జన సమీకరణ జరిగినప్పటికీ రెండు పార్టీల సభలలో ఒకే ముఖాలు కనిపించాయి. వీటన్నింటినీ పరిగణలోనికి తీసుకుని ఈ సారి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అప్పుడు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నాయి. ప్రస్తుత శాసన సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టగా, కేంద్రంలో బిజెపి కొనసాగుతోంది. ఈ సారి పార్లమెంట్ సీటు ఎలాగైనా కైవసం చేసుకోవాలని మూడు పార్టీలకు చెందిన అభ్యర్థులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మండలాల వారీగా వారివారి అనుచరవర్గాలతో నిత్యం టచ్‌లో ఉంటూ సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారానికి పూనుకుంటున్నారు. ఇతర,ధార్మిక కార్యక్రమాలల్లో పాల్గొంటూ ప్రజలకు దగ్గరయ్యేందుకు చూస్తున్నారు.

**కాంగ్రెస్‌కు కో ఆర్డినేటర్లు....**

కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌ఎలు, నియోజకవర్గ ఇంచార్జీలపై బాధ్యతలు పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లో ముమ్మర ప్రచారం చేయడంతో పాటు ఆరు నూరైనా అభ్యర్థి గెలిచి తీరాలని అగ్రనేతలు ఆదేశాలు జారీ చేశారు. వీరితో పాటు నియోజకవర్గాలను సమన్వయం చేసేందుకు కొత్తగా కో ఆర్డినేటర్లను నియమించారు. వీరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతుండగా అభ్యర్థి పోరిక బలరాం నాయక్ పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

**బిజేపి ప్రచారం....**

భారతీయ జనతా పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపి ప్రొఫెసర్ అజ్మీరా సీతారామ్ నాయక్ ఇప్పటికే పార్లమెంట్ పరిధిలో పలు చోట్ల స్థాయి సమావేశాలు నిర్వహించారు. తర్వాత మండలాల వారీగా కూడా సమావేశాలు నిర్వహిస్తున్నారు. నాయకులు పాత, కొత్త కార్యకర్తలను కలుపుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. దేశంలో మళ్లీ నరేంద్రమోడి మరోసారి ప్రధాని అవుతారని,బిజేపి అధికారంలో ఉంటుంది కాబట్టి ఇక్కడి కూడా బిజెపి అభ్యర్థిని గెలిపించుకుంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని చెబుతున్నారు.

**మాజీలతో బిఆర్ఎస్ ప్రచారం....**

శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలైన బిఆర్ఎస్ నేతలు పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవాలని యోచిస్తున్నారు. ఇప్పటికే దీనిపై అధినేత కేసిఆర్ వారికి దిశా నిర్దేశం చేసి ధైర్య పరిచారు. పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత గెలిచేందుకు ఇప్పటికే పార్లమెట్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. భద్రాచలం సీటును బిఆర్ఎస్ కైవసం చేసుకున్నప్పటికీ ఆ ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు తాజాగా కాంగ్రెస్ తీర్థ పుచ్చుకోవడంతో ఏడు నియోజకర్గాల్లో కాంగ్రెస్ ఎంఎల్‌ఏ ఉన్నారు. భద్రాచలంలో సీనియర్ నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్‌లు ప్రచార బాధ్యతలను నెత్తినెత్తుకున్నారు. ఇక పినపాక నియోజకవర్గంలో మాజీ ఎంఎల్‌ఏ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, ఇల్లెందు మాజీ ఎంఎల్‌ఏ హరిప్రియా నాయక్, మహబూబాబాద్ మాజీ ఎంఎల్‌ఏ బానోత్ శంకర్ నాయక్, డోర్నకల్ నుండి రెడ్యా నాయక్, నర్సంపేట పెద్ది సుదర్శన్ రెడ్డి, ములుగు బడే నాగజ్యోతి ల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా నేతలు కొందరు పార్టీల మారుతున్నప్పటికీ బలమైన క్యాడర్ ఉండటంతో వారితో సమావేశాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. నామినేషన్ తర్వాత మూడు పార్టీలకు చెందిన నేతలు రంగప్రవేశం చేయనుండటంతో పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించే అవకాశాలున్నాయి.

**రెండు పార్టీల మధ్యే పోటీ...**

ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యే పోటీ నెలకొంది. ప్రతీ అంశాన్ని వారికి అనుకూలంగా మలుచుకునేందుకు తీవ్ర కృషి చేస్తున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో అధికార పగ్గాలను కాంగ్రెస్ చేపట్టడంతో పాటు ప్రతీ నియోజకవర్గం కాంగ్రెస్‌కు అనుకూలంగా మారడంతో ఆ పార్టీ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ నుండి పోటీలో ఉన్న అభ్యర్థి బలరాం నాయక్ కూడా అంతే ధీమాతో ఉన్నారు. ఇక బిఆర్ఎస్ చావోరేవో అనే చందంగా బరిలో నిలిచింది. సిట్టింగ్ ఎంపికే టిక్కెట్ కేటాయించినప్పటికీ పార్లమెంట్ పరిధిలో వ్యతిరేక పవనాలు వీస్తుండటంతో గెలుపు అంత సునాయాసం కాదనే ఆలోచనలో పడ్డారు. ఇదే విషయాన్ని ఆ పార్టీ క్యాడరే చెబుతోంది. దీంతో బిఆర్ఎస్ అభ్యర్థి ఖర్చు పెట్టేందుకు విముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఎన్నికల నోటిఫికేషన్ సమయం దగ్గర పడుతున్న తరుణంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మరో సారి ఓట్లు పండుగ సందడి నెలకొంది.

## వీధి కుక్కలు, కోతుల బెడద తప్పేదెన్నడో..!?

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో వీధి కుక్కలు మరియు కోతులు బెడద తప్పేది ఎన్నడు అంటూ అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల ,కల్లూరు, చిన్న కోరుకొండి, ముచ్చవరం, కొర్లగూడెం, పాయపూరు పేరువంచ, కొర్లగూడెం, నారాయణపురం, బత్తులపల్లి ,తదితర గ్రామాలలో కోతులు కుక్కలు నుంచి ప్రతిరోజు గాయాలు పాలవుతున్నారు. వాటి బెడదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వీధి కుక్కలు తోపాటు కోతులు ప్రజలపై ప్రతిరోజు దాడులు చేస్తున్నాయి.ి దీంతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. వీటి నియంత్రణకు మార్గాలను అన్వేషించి ప్రజలను వాటి నుండి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. మరియు మండల పరిధిలోని కోతులు పంటలను ధ్వంసం చేస్తూ పంటలకు నష్టం కలిగిస్తున్నారు. వీటి రక్షణార్థమై ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కోతులు కుక్కలు బెడద నుంచి ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు . పాఠశాల పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే ప్రజలు నిత్యవసరాలకు వెళ్లాలన్న ఉద్యోగులు విధులు నిర్వహణకు వెళ్లాలన్నా భయపడుతున్నారు కుక్కలు కోతులు నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రణాళికలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న



ప్రజాపక్షం/చంద్రుగొండ: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలో గల గ్రామంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో నూతనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా ప్రతి ఒక్కరు కలిసి మెలిసి ఉండాలన్నారు. అనంతరం పలు గ్రామాల్లో అనారోగ్యానికి గురైన పార్టీకార్యకర్తలను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి బానోత్ పార్వతి, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, నల్లమోతు రమణ, రాముడు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గిరిజన మోర్చా ఉపాధ్యక్షునిగా రాజేష్ నాయక్



ప్రజాపక్షం/చంద్రుగొండ: జిల్లా గిరిజన మోర్చా ఉపాధ్యక్షులుగా మండల పరిధిలోని గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గుగులోత్ రాజేష్ నాయక్‌ను నియమించినట్లు తెలిపారు. ఈసందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు కేవీ రంగాకిరణ్ నియామక పత్రాన్ని అందజేశారని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకే నన్ను గుర్తించి ఈ పదవి ఇచ్చారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానన్నారు. ఈ పదవి ఇచ్చిన జిల్లా నాయకులకు నాకు సహకరించిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు భోగి కృష్ణయ్య, నాయకులు నల్లమోతు రఘుపతిరావు, భూక్య రాంపండు, తదితరులు పాల్గొన్నారు.

## రవిని పరామర్శించిన సిపిఐ నాయకులు



ప్రజాపక్షం/ బోనకల్ : మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బొట్ల రవి ఇటీవల ప్రమాదానికి గురై ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం రవిని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, యంగల గిరి, సాగర్ తదితరులు ఉన్నారు.

## వడదెబ్బపై అవగాహన



ప్రజాపక్షం/ మధిర : మండల పరిధిలోని దెందుకూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పృధ్వీరాజ్‌నాయక్ ఆధ్వర్యంలో మధిర పట్టణం, గ్రామాల్లో పారా మెడికల్ సిబ్బంది ప్రజలకు వడదెబ్బపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని తొండలగోపారం, తొర్లపాడు, ఖమ్మంపాడు, చిలుకూరు, దెందుకూరు, మహాదేవపురం, మడుపల్లి, మధిర టౌన్‌లో వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్ఎస్‌ద్రావణంపై ఆరోగ్య పర్యవేక్షకుడు లంకా కొండయ్య వివరించారు. ప్రత్యేకంగా ఉపాధిహామీ కూలీలకు వడదెబ్బపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది గోవింద్, సుబ్బలక్ష్మీ, ఎఎన్ఎంలు వంగూరి విజయకుమారి, భారతి, వై.లక్ష్మీ, లీలా, నాగరణి, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మధిర సెయింట్ ఫ్రాన్సిస్ విద్యార్థుల విజయ దుందుభి



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు అత్యధికశాతం ఉత్తీర్ణత సాధించి విజయదుందుభి మోగించారు. గత జనవరి నెలలో జరిగిన సిమో నేషనల్ ఒలిపోయాడ్ ఫైనల్ పరీక్షల్లో 70మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 50మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికేట్స్, ఆలిండియా లెవల్‌లో మొదటి, రెండవ, మూడవ నాల్గొవ, ఐదవ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. శనివారం జరిగిన అభినందన సభలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అందచేశారు. తరగతి గదిలో నాలుగు గోడల మధ్య కేవలం చదువు మాత్రమే కాకుండా బాహ్య ప్రపంచంలో జరిగే ప్రతి పోటీ పరీక్షకు సెయింట్ ప్రాన్సిస్ విద్యార్థులు సన్నద్ధం చేయడంలో యాజమన్యం ఎల్లవేళలా కృషి చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.